సాక్షి
నారాయణపేట

ఆదివారం, 22, సెప్టెంబర్, 2024



ఏటీఎంలో చోరీ

పెబ్బేరులోని ఎస్‌బీఐ ఏటీఎంలో దుండగులు రూ.17.92 లక్షలు చోరీ చేశారు.

వివరాలు 8లో ▸



సరిహద్దులో తనిఖీలు

ఏపీ– తెలంగాణ సరిహద్దు పుల్లూరు టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.5 /22.3

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. ఎండ ఎక్కువగా ఉంటుంది. మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విదేశీ విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట: మహాత్మా జ్యోతిబాపూలే విదేశీ విద్యా పథకం కింద ఫాల్ సీజన్‌కు అర్హులైన బీసీ, ఈబీసీ విద్యార్థులు అక్టోబర్ 15లోగా 'ఈ పాస్' వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వయస్సు 35 ఏళ్లలోపు ఉండాలని, ఇంజినీర్, మేనేజ్‌మెంట్, సైన్స్, వ్యవసాయం, మెడిసిన్, నర్సింగ్, సోషల్ సైన్సెస్, అగ్రికల్చర్, హ్యూమానిటీస్ కోర్సుల్లో 60 శాతం మార్కులు సాధించి ఉండాలని పేర్కొన్నారు. విదేశీవర్సిటీల నుంచి ఐ-20, వీసా పొందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రాజీ మార్గమే.. రాజమార్గం: ఎస్పీ

నారాయణపేట: రాజీమార్గమే రాజమార్గమని ఈ నెల 28న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నారాయణపేట, కోస్గి కోర్టులలో 'నేషనల్ లోక్ అదాలత్' సందర్భంగా కక్షిదారులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. యాక్సిడెంట్ కేసులు, పరస్పర, చీటింగ్, వివాహ బంధానికి సంబంధించి, చిన్న చిన్న దొంగతనం కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, ఇతర రాజీ పడదగు కేసులలో జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవచ్చని ఎస్పీ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీజీ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు డీబార్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ పరిధిలో శనివారం జరిగిన సెమిస్టర్-2 పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ పట్టుబడ్డారు. ఈ మేరకు పట్టుబడిన వారిని అధికారులు డీబార్ చేశారు. మొత్తం ఎనిమిది కేంద్రాల్లో 1,873 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 1,769 మంది విద్యార్థులు హాజరై 101 మంది గైర్హాజరయ్యారు. పీయూ పరీక్ష కేంద్రాన్ని కంట్రోలర్ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ తనిఖీలు నిర్వహించారు.

జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలకు ఆహ్వానం

నారాయణపేట: యువతలో సాంస్కృతిక సృజన వెలికి తీసేందుకు ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తోందని, ఆసక్తి గల యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ఎస్.వెంకటేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. యువజన ఉత్సవాల్లో పాల్గొనే జిల్లా వాసులు 15–29 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని, పోటీలో పాల్గొనేవారు తమ వాయిద్యాలు, పరికరాలను వారే తీసుకురావాలని పేర్కొన్నారు. జానపద నృత్యం గ్రూపు, జానపద నృత్యం సోలో, జానపద గీతం గ్రూపు, జానపద గీతం సోలో పోటీల్లో యువత పాల్గొని ప్రతిభ కనబర్చాలని, ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాల్గొనే వారు సెల్ నం.9490409900కు వాట్సప్ ద్వారా ఈ నెల 25 వరకు వివరాలు పంపించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటం

నారాయణపేట: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం 50 ఏళ్ల ఉద్యమ చరిత్రలో అలుపెరగని ఉద్యమాలు కొనసాగిస్తున్న చరిత్ర పీడీఎస్‌యూది అని, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఏర్పడి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కేంద్రంలో ఎస్.ఆర్ గార్డెన్ లో ఈనెల 27న నిర్వహించే స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి గౌస్, వెంకటేష్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఎస్ జూనియర్ కళాశాలలో కరపత్రాలు పంచుతూ 50 ఏళ్ల స్వర్ణోత్సవ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థి పోరుబాటలో నడిచిన విద్యార్థి సంఘం పీడీఎస్‌యూ అని, విద్యార్థి ఉద్యమాన్ని ఉధృతం చేసిన పీడీఎస్‌యూ కోట్లాది మంది విద్యార్థులకు మార్గదర్శకమైందన్నారు. స్వర్ణోత్సవ సభకు విద్యార్థులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, రమేష్, నరేష్, ఆనంద్, శివరాంజని, ఆశమ్మ, ఆనంద, రాకేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

వందేళ్ల పోస్టాఫీస్

దేవరకద్ర తపాలా కార్యాలయానికి 103 ఏళ్ల ఘనమైన చరిత్ర

- స్వాతంత్య్రానికి పూర్వం నుంచే అందుబాటులో..
- నిజాం కాలంలో నిర్మాణం.. నేటికీ చెక్కు చెదరని భవనం
- 45 గ్రామాలకు ఇక్కడి నుంచే ఉత్తర ప్రత్యుత్తరాలు

సండే స్పెషల్

దేవరకద్ర: దేవరకద్ర పోస్టాఫీసుకు ఘన చరిత్ర ఉంది. స్వాతంత్య్రం రాక ముందు నైజాం పాలనలో ఈ పోస్టాఫీసు నిర్మించారు. ఇప్పటికీ బయట పోస్టాఫీసు గోడపై 1921 ఏడీ అనే శిలాఫలకం కనిపిస్తుంది. కేంద్ర ప్రభుత్వం పలుమార్లు పోస్టాఫీసుకు మరమ్మతు చేయడంతో ఇప్పటికి చెక్కు చెదరకుండా ప్రజలకు సేవలు అందిస్తుంది. బ్రిటీష్, నైజాం పాలనలో సామంతులుగా ఉండే రాజులు, దొరలకు సైతం దేవరకద్ర పోస్టాఫీసు ద్వారా ఉత్తరాలు బట్వాడా చేసినట్లు వినికిడి. అయితే ఆనాడు ఉత్తరాలను బట్వాడా చేసేవారిని టప్పను మోసే వారిగా పిలిచేవారు. చాలా గ్రామాలకు టప్పను తీసుకుపోయి అందించడానికి ప్రత్యేకంగా కొందరిని నియమించేవారు. వారు పరుగెత్తి.. లేక నడుచుకుంటూ వెళ్లి గ్రామాల్లో ఉండే పెద్దలకు ఉత్తరాలను అందించేవారు. దూర ప్రాంతాలకు అయితే దేవరకద్ర నుంచి కొంతదూరం వరకు వెళ్లి అక్కడ ఉండే మరో టప్ప మోసే వారికి ఉత్తరాలను ఇచ్చేవారు. ఇలా ఒకరి నుంచి ఒకరు అందుకుంటూ మహబూబ్‌నగర్, నారాయణపేట, హైదరాబాద్ వరకు ఉత్తరాలను చేరేవేసేవారని అప్పటి తరం వారు పేర్కొంటున్నారు. ఇలా మొదలైన ఉత్తరాల ప్రయాణం రాన్రాను రైళ్లు, బస్సులు, విమానాల ద్వారా ప్రజలు, కార్యాలయాలకు చేరవేసే పరిస్థితి వచ్చింది. దేవరకద్రలో



103 ఏళ్ల నాటి దేవరకద్ర పోస్టాఫీసు ఇదే

టెలిగ్రాం సౌకర్యం కూడా ఉండేది. దూర ప్రాంతాల నుంచి వచ్చే అత్యవసర మెసేజ్‌లను టెలిగ్రాం ద్వారా వారికి చేరవేసేవారు. ఏ సమాచారం అయినా పోస్టాఫీసు మీద ప్రజలు ఆధారపడేవారు. ఇక ఇప్పుడు ఆ పరిస్థితి కూడా దాటిపోయింది. టీవీలు, లాప్‌టాప్‌లు, ఆండ్రాయిడ్ ఫోన్లు వచ్చాక వాట్సాప్, ఇన్‌స్టాగాం, ఫేస్‌బుక్, ఎక్స్ ఇలా ఆధునిక యుగంలో అప్పటికప్పుడు మెసేజ్‌లు, వీడియో కాల్స్, లైవ్‌గా ఒకరిని ఒకరు చూస్తూ మాట్లాడుకోవడం వంటి సౌకర్యాలు వచ్చాయి. ఇక పోస్టాఫీసులకు పని లేకుండాపోయింది. అయితే ప్రభుత్వ పరంగా ఇంకా పలు విభాగాలకు పోస్టాఫీసు అవసరాలు ఉంటున్నాయి. ఇక సేవింగ్ ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఉపాధి కూలీల డబ్బుల చెల్లింపు, ప్రభుత్వ



1921 సంవత్సరంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం

పింఛన్లు, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలకు పోస్టాఫీసు వేదికగా మారింది. ప్రస్తుతం బ్యాంకులతో సమానంగా పోస్టాఫీసులో ఆన్‌లైన్ సేవలు అందిస్తున్నారు. దేవరకద్రలో కేవలం ఒక సబ్ పోస్టుమాస్టర్ ఉండడం వల్ల సేవలు అందించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పెరిగిన జనాభాకు అనుగుణంగా వివిధ పథకాల ద్వారా సేవలు విస్తృతపరచడానికి ఇక్కడ అదనంగా సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

45 గ్రామాలకు బట్వాడా..

దేవరకద్ర సబ్ పోస్టాఫీసుగా ఉంటూ 45 గ్రామాలకు ఇక్కడి నుంచి ఉత్తరాలను బట్వాడా చేస్తారు. పోస్టాఫీసు పరిధిలో 13 మంది డాక్ సేవక్‌లు పనిచేస్తున్నారు. ఒక్కో డాక్‌సేవక్ మూడు నుంచి నాలుగు గ్రామాలకు ఉత్తరాలు, మనీయార్డర్లు, ఇతర సేవలు అందించడానికి ఏర్పాట్లు చేశారు. ప్రతిరోజు డాక్ సేవక్‌లు తమ పరిధిలోని గ్రామాలకు వెళ్లి వచ్చిన ఉత్తరాలను ఇవ్వడం.. అక్కడి నుంచి పంపించే ఉత్తరాలను తెచ్చి పోస్టాఫీసుకు చేరవేస్తారు. ఇక గ్రామస్థాయిలో పింఛన్ల పంపిణీ, ఉపాధి కూలీల డబ్బుల చెల్లింపులు సైతం చేస్తున్నారు.

చేజారిన అవకాశం

2012– 13లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆమ్ ఆద్మీ పథకం కింద దేవరకద్ర పోస్టాఫీసును ఎంపిక చేశారు. దేశవ్యాప్తంగా 200 పోస్టాఫీసులను ఆధునికీకరించి బ్యాంకులతో సమానంగా సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆమ్ ఆద్మీ పథకం కింద లక్కీడిప్ నిర్వహించగా అందులో దేవరకద్ర ఎంపికైంది. అయితే అప్పటి ప్రజాప్రతినిధులు దేవరకద్ర పోస్టాఫీసును పక్కనబెట్టి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయాన్ని ఎంపిక చేశారు. దీంతో దేవరకద్ర పోస్టాఫీసుకు వచ్చిన అవకాశం చేజారిపోయింది.

మెరుగైన సేవలు..



దేవరకద్ర పోస్టాఫీసు ద్వారా వచ్చిన అందరికీ మెరుగైన సేవలు అందిస్తున్నాం. చాలామంది ఇతర గ్రామాల నుంచి ఇక్కడికి వస్తున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న పరిష్కరిస్తున్నాం. పోస్టాఫీసు ద్వారా ఉపాధి కూలీలకు కూలీ డబ్బులు, ప్రభుత్వ పింఛన్లు, సేవింగ్ ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాల ద్వారా సేవలు అందిస్తున్నాం. పోస్టాఫీసులో సేవ లు మరింత మెరుగుపరచడానికి అదనంగా సిబ్బంది అవసరం.

– జనార్దన్,
సబ్ పోస్టుమాస్టర్, దేవరకద్ర

వన్యప్రాణులకు మరింత రక్షణ

నల్లమలలో జంతువుల సంరక్షణకు సాంకేతికత వినియోగం

- అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో మూడు రోజుల పాటు శిక్షణ
- వన్యప్రాణులకు అపాయం కలిగించకుండా సంరక్షించేలా స్థానికులకు అవగాహన

సాక్షి, నాగర్‌కర్నూల్: నల్లమల అటవీ ప్రాంతంలోని అమూల్యమైన వన్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. ప్రమాదాల్లో చిక్కుకున్న జంతువులను సంరక్షించి క్షేమంగా అడవికి చేర్చేలా ఇప్పటికే తమ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మహారాష్ట్రలోని పూణేకు చెందిన రెస్క్యూ చారిటీ ట్రస్ట్ ఆధ్వర్యంలోని నిపుణుల బృందం ఇక్కడి అటవీ సిబ్బందికి శిక్షణనిచ్చింది. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో ఈ బృందం మూడు రోజుల పాటు పర్యటించి వివిధ అంశాల్లో అటవీశాఖ సిబ్బందికి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించింది.



అడవి చుట్టూ పహారా..

అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని పులులు, చిరుతలు, జింకలు, వన్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ పటిష్ట చర్యలు చేపడుతోంది. ఇప్పటికే ఏటీఆర్ పరిధిలో మొత్తం 34 పులులు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. వీటితో పాటు 150కి పైగా చిరుతలు, 2,347 మనుబోతులు, 5,309 కణుతులు, దాదాపు 14 వేల చుక్కల జింకలు, 8 వేల అడవి పందులు, 4,080 కొండ ముచ్చులు తదితర వన్యప్రాణులు ఉన్నట్టు లెక్క తేల్చారు. వీటి సంరక్షణకు అటవీ ప్రాంతంలో ఎవరూ వేటాడకుండా పకడ్బందీగా నియంత్రణ చర్యలు చేపట్టారు. అటవీ పరిసరాల్లో కందకాలు, బండ్‌లతో కంచె ఏర్పాటు చేశారు. సమీప గ్రామాల నుంచి అటవీ ప్రాంతాలకు వెళ్లే దారుల్లో విస్తృతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ట్రాక్ కెమెరాలు, సీసీ కెమెరాలు, వాచ్ టవర్లు, అటవీ శాఖ బేస్ క్యాంపుల ద్వారా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.



అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో వన్యప్రాణుల సంరక్షణపై శిక్షణ ఇస్తున్న నిపుణులు (ఫైల్)

ప్రమాదాల నుంచి రక్షించేలా..

నల్లమలలోని వన్యప్రాణులను పూర్తిస్థాయిలో సంరక్షించేందుకు అటవీశాఖ సమాయత్తమవుతోంది. అడవి పరిసర ప్రాంతాల్లోకి వన్యప్రాణులు వెళుతూ తరచుగా ప్రమాదాల్లో చిక్కుకుంటున్నాయి. సమీపంలోని వ్యవసాయ బావుల్లో పడిన వన్యప్రాణులు.. సహాయక చర్యలు ఆలస్యం అవుతుండటంతో మృత్యువాతపడుతున్నాయి. ప్రమాదవశాత్తు బావుల్లో పడిపోయిన వన్యప్రాణులు, ఇతర జంతువులను వెంటనే బయటకు తీసేలా ఇటీవల అటవీ సిబ్బందికి శిక్షణనిచ్చారు. ఇందుకోసం స్ట్రెచర్, హుక్కులు, తాళ్లు, బెల్టులు తదితర సామాగ్రిని అందుబాటులో ఉంచుకునేలా అధికారులకు అవగాహన కల్పించారు. కొండచరియల్లో, బండరాళ్ల నడుమ చిక్కుకున్న వన్యప్రాణులను కాపాడటంపై సిబ్బందికి తర్ఫీదునిచ్చారు. దారి తప్పి జనసంచారం నడుమ, గ్రామాల్లోకి ప్రవేశించే వన్యప్రాణుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయడం, వారికి ధైర్యం చెప్పడంతో పాటు వన్యప్రాణులకు ఎలాంటి ముప్పు లేకుండా చాకచక్యంగా పట్టుకోవడంపై శిక్షణ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన అధునాతన పరికరాలను త్వరలోనే సమకూర్చుకోనున్నట్టు అధికారులు చెబుతున్నారు.



శిక్షణలో పాల్గొన్న అటవీసిబ్బంది (ఫైల్)

పూర్తిస్థాయిలో సంరక్షణకు చర్యలు



నల్లమలలోని వన్యప్రాణుల సంరక్షణకు ఎప్పటికప్పుడు పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం. అలాగే వన్యప్రాణులు ఎప్పుడైనా ప్రమాదాల్లో చిక్కుకున్నప్పుడు వెంటనే రక్షించేందుకు అధునాతన పరికరాలను వినియోగించేలా సిబ్బందికి శిక్షణ అందించాం. బావుల్లో పడిన వన్యప్రాణులను రక్షించే మెళకువలపై అటవీ సిబ్బంది ఇప్పటికే శిక్షణ పొందారు.

– రోహిత్ గోపిడి,
జిల్లా అటవీశాఖ అధికారి, నాగర్‌కర్నూల్

తుదిదశకు సాగు సర్వే

- క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్న ఏఈఓలు
- పర్యవేక్షిస్తున్న ఏఓలు
- వానాకాలం సీజన్‌లో 4,20,642 ఎకరాల్లో పంటల సాగు
- అగ్రస్థానంలో పత్తి, వరి పంటలు..

నారాయణపేట: వానాకాలం సీజన్‌లో జిల్లాలోని 11 మండలాలు, 252 రెవెన్యూ గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను క్షేత్ర స్థాయిలో వ్యవసాయ యంత్రాంగం సర్వే చేస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుంది. ఈ సర్వే సైతం తుదిదశకు చేరుకుంది. జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్ సుధాకర్ దిశానిర్దేశంతో ఏఓల పర్యవేక్షణలో ఏఈఓలు పంటల పై సర్వే చేస్తున్నారు.

అత్యధికంగా పత్తి సాగు

జిల్లా వ్యాప్తంగా వివిధ రకాలైన పంటలు వానాకాలం సీజన్‌లో 4,66,050 ఎకరాల్లో సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో పత్తి 1,65,150 ఎకరాలు, వరి 1,65,092 ఎకరాలు, కంది 60,800 ఎకరాలు, జొన్న 7,539, మినుములు 290 ఎకరాలు, ఆముదాలు 489 ఎకరాలు, పచ్చిరొట్ట, జీలుగ 10,840 ఎకరాలు, పెసర 8,738, మొక్కజొన్న 165, అలసందలు 86 ఎకరాలు, వేరుశనగ 37, నువ్వులు 54, చెరకు 478, తీగపెసర 148 ఎకరాల్లో సాగుచేశారు. ఇప్పటి వరకు 4,20,642 ఎకరాల్లో వివిధ పంటలను సాగుచేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ నేలాఖరు వరకు పంటల సర్వే పూర్తి కానుందని అధికారులు చెబుతున్నారు.

పకడ్బందీగా చేపడుతున్నాం..

పంటల సర్వేను పకడ్బందీగా చేపడుతున్నాం. ఈ ఏడాది వానాకాలం పంటలు వేసిన రైతుల వివరాలను పంటల పొలాల వద్దకు వెళ్లి క్షేత్రస్థాయిలో వ్యవసాయ సిబ్బంది ఆన్‌లైన్‌లో రైతుబంధు పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. నెలాఖరు నాటికి వంద శాతం పంటల సర్వే పూర్తి చేస్తాం.

– జాన్‌సుధాకర్,
జిల్లా వ్యవసాయశాఖ అధికారి



కృష్ణాలో సర్వే వివరాలను క్రాస్ చెక్ చేస్తున్న డీఏఓ జాన్‌సుధాకర్

క్రాప్ క్రాస్ చెకింగ్

వ్యవసాయశాఖలో పనిచేసే ఏఈఓలు క్షేత్రస్థాయిలో రైతుల పొలాల్లోకి వెళ్లి పంటలను పరిశీలిస్తూ సర్వే చేస్తున్నారు. జిల్లాలో 77 క్లస్టర్లలో పూర్తి స్థాయిలో వంద శాతం సర్వే చేసేందుకు ఏఈఓలు పంటలను పరిశీలించి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తుండగా ఏఓలు పర్యవేక్షిస్తున్నారు. ప్రధానంగా పంటల నమోదులో సర్వే నంబర్, రైతులు సాగుచేసే పంటల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండడంతో వాటిని జిల్లాలోని ఏడీఏలు క్రాప్‌ను క్రాస్ చెక్ చేస్తున్నారు. అకస్మాత్తుగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి పర్యవేక్షించి ఏఈఓల నుంచి ఏఓల వరకు చేస్తున్న పనితీరును పరిశీలిస్తున్నారు. శాంపిల్‌గా ఒక గ్రామంలో నాలుగైదు సర్వే నంబర్లను కేటాయించి క్షేత్ర స్థాయిలో పరిశీలించి స్పీడప్ చేయాలని సూచిస్తున్నారు. రైతులు తాము పండించే పంటల్లో ఏదైనా సమస్య వస్తే వెంటనే సంబంధిత ఏఈఓకు సమాచారం అందిస్తూ వారి సూచన మేరకు నాణ్యమైన ఎరువులు, మందులను వేయాలని సూచిస్తున్నారు.

మధ్యాహ్న భోజనానికి ముక్కిన బియ్యం

- తల్లిదండ్రుల ఆగ్రహం



కొమ్మురు ప్రాథమిక పాఠశాలలో ముక్కిపోయి, పురుగుపట్టిన బియ్యం

మద్దూరు: ఉమ్మడి మద్దూరు మండలంలోని కొమ్ముురు ప్రాథమిక పాఠశాలలో ముక్కిన, చిట్టెలు కట్టిన బియ్యం కలకలం సృష్టించింది. శనివారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు నాణ్యమైన భోజనం అందించడంలేదని వంట ఏజెన్సీ మహిళలకు తెలపగా.. వారు తమకు బియ్యం సక్రమంగా ఇవ్వడం లేదని చెప్పారు. దీంతో స్టోర్ రూంలో ఉన్న బియ్యాన్ని పరిశీలించగా.. ఆరు 50 కేజీల బియ్యం సంచులు ముక్కిపట్టి పురుగులతో ఉండడాన్ని గమనించారు. వీటితోనే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండుతున్నట్లు తెలపడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న ఉపాధ్యాయులు ఇవి పాత బియ్యం అని, వర్షాలకు తడిసి ఇలా అయ్యాయని సర్ది చెప్పారు. అయితే, పాఠశాలలో 68 మంది విద్యార్థులు ఉంటే ప్రతినెలా దాదాపు 1.5 క్వింటాళ్ల బియ్యం సరఫరా జరగాలి. కానీ ఇక్కడ దాదాపు 6 బస్తాల బియ్యం నిల్వలు ఉండడంతో అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. గతేడాది బియ్యం నిల్వలు అలాగే ఉన్నాయని, వర్షాల కారణంగా బియ్యం ముక్కిపోయిందని, బియ్యాన్ని జల్లెడ పడుతున్నామని సమాధానం ఇచ్చారు.

24న హ్యాండ్‌బాల్ సెలక్షన్ ట్రయల్స్ ఎంపిక

నారాయణపేట: రాష్ట్ర క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి అండర్-17 హ్యాండ్‌బాల్ సెలక్షన్ ట్రయల్స్ జిల్లా జట్టును ఈ నెల 24న కోస్గి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడా సమాఖ్య అధ్యక్షుడు నర్సింహులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో పాల్గొనే బాల, బాలికలు ప్రస్తుతం చదువుతున్న బోనోఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, ఇంటర్ విద్యార్థులైతే పదో తరగతి మెమో జిరాక్స్ తీసుకు రావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం ఫిజికల్ డైరెక్టర్ బాలరాజు సెల్ నం .91207 99991ను సంప్రదించాలని కోరారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని కృషి



కొల్లూరు పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

ఊట్కూరు: విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం కొల్లూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదుల్లో విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పాఠశాలలో మౌలిక వసతుల గురించి ప్రధానోపాధ్యాయుడు కృష్ణయ్యను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల కొరత ఉందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఉన్నతాధికారులతో చర్చించి సమస్య తీరుస్తానని హామీ ఇచ్చారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలలో మౌలిక వసుతులు ఏర్పాటు చేయడం జరిగిందని, విద్యుత్తు సౌకర్యంతోపాటు మరుగుదొడ్లు, తాగునీరు సదుపాయాలు కల్పించామన్నారు. మాజీ సర్పంచ్ సరోజసమృద్ధి, గోవిందరాజు, వెంకటప్ప, రాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం


జయరాములు (ఫైల్)

ఊట్కూరు: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఊట్కూరు మండలం పులిమామిడి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. దేవరకద్ర మండలం గోటూరుకు చెందిన గ్రామానికి చెందిన దాసరి జయరాములు (35)కు పులిమామిడికి చెందిన రాధతో పదేళ్ల క్రితం వివాహమైంది. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో భార్యాభర్తలు గొడవ పడ్డారు. ఈ క్రమంలో తన భర్త మద్యం తాగి తనను కొడుతున్నాడని రాధ డయల్ 100కు ఫిర్యాదు చేయడంతో ఆందోళనకు గురైన జయరాములు.. గ్రామ సమీపంలోని చెరువులో పడ్డాడు. పోలీసులు గ్రామానికి చేరుకొని స్థానికుల సహాయంతో అతడిని బయటికి తీసుకొచ్చారు. చికిత్స నిమిత్తం పోలీసు వాహనంలోనే మక్తల్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ కృష్ణంరాజు తెలిపారు. జయరాములుకు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పురుగు మందు తాగి వృద్ధురాలి మృతి

గోపాల్‌పేట: పురుగుల మందు తాగి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఏదుట్ల గ్రామానికి చెందిన గుగ్గిళ్ల సాయమ్మ(57), కుమారుడు రాజు ఇంట్లో గొడవ పడి శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగారు. వారిని స్థానికులు వెంటనే వనపర్తి తరలించారు. సాయమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాజు పరిస్థితి నిలకడగా ఉండగా, సాయమ్మ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందింది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

కందూర్‌లో వ్యక్తి ఆత్మహత్య

అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామానికి చెందిన తిరుపతయ్య(55) ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులు భోజనం చేసిన తర్వాత అందరు నిద్రపోయారు. శనివారం తెల్లవారుజామున అతని భార్య లక్ష్మమ్మ లేచి చూసే సరికి భర్త తిరుపతయ్య ఊరేసుకుని మృతి చెంది కనిపించడంతో బోరున విలపించింది. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఇదిలా ఉండగా తిరుపతయ్య ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

లేగదూడపై చిరుత దాడి

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని శ్రీ రామకొండ సమీపంలో శనివారం సాయంత్రం రైతు రాజు వ్యవసాయ పొలంలో ఉన్న లేగదూడపై చిరుత దాడిచేసి చంపివేసింది. కాగా లేగదూడ విలువ సుమారు రూ. 5వేలు ఉంటుందని రాజు తెలిపారు. చిరుత కారణంగా పశువులను కాపాడుకోవాలంటే భయంగా ఉందని వాపోయాడు. చిరుత నుంచి తమకు, పశువులకు సమస్యలు లేకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

కేటీదొడ్డి: మండలంలో బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదైంది. ఈనెల 12న కేటీదొడ్డి మండలానికి చెందిన బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా, గమనించిన కుటుంబ సభ్యులు గద్వాల ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం బాలిక మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. బాలిక మృతదేహానికి శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న గద్వాల సీఐ నాగేశ్వర్‌రెడ్డి ఉమిత్యాల గ్రామానికి చేరుకుని బాలిక తల్లిదండ్రులను విచారించారు. ఎవరిపైన అయిన అనుమానాలుంటే ఫిర్యాదు చేయాలని కోరారు. బాలిక మృతిపై సోషల్ మీడియాలో వార్త వైరల్ అవుతోంది. మండలానికి చెందిన కొందరు యువకులు బాలికను లైంగిక వేధింపులు గురి చేయడంతో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిందా? లేక ఆరోగ్య సమస్యలా? అనే విషయాలు పోలీసుల దర్యాప్తుతో తేలనున్నది. బాలిక ఆత్మహత్యకు కారణాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

‘ఉదండాపూర్’ పనుల్లో కదలిక

- రిజర్వాయర్ పనుల పున:ప్రారంభానికి కుదిరిన ముహూర్తం
- మరోవైపు పరిహారం, పునరావాహం కల్పించాలని నిర్వాసితుల డిమాండ్
- పనులను అడ్డుకునేందుకు యత్నం
- పహారా కాస్తున్న పోలీసు బలగాలు


ఉదండాపూర్ రిజర్వాయర్ క్యాంపు వద్ద పనులకు సిద్ధం చేసిన యంత్రాలు, టిప్పర్లు

జడ్చర్ల: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా జడ్చర్ల మండలంలో చేపట్టిన ఉదండాపూర్ రిజర్వాయర్ పనుల్లో కదలిక వచ్చింది. పనులు ప్రారంభించేందుకు సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు చర్యలు చేపట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో చురుగ్గా సాగిన రిజర్వాయర్ నిర్మాణ పనులు అసెంబ్లీ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ ఓటమి చెంది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి. పనులను చేపట్టే కాంట్రాక్టర్లు అన్ని సర్దుకుని వెళ్లిపోయారు. యంత్రాలు, టిప్పర్ల కదలికలతో కనిపించే రిజర్వాయర్ ప్రాంతం ఒక్కసారిగా నిర్మానుశ్యంగా మారిపోయింది. దాదాపు 10 నెలలకుపైగా ఎక్కడా ఇసుమంత పని చేపట్టిన పరిస్థితి లేకపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనుల పురోగతి ఏమీ లేదని, నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ.. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేల బృందం ఉదండాపూర్ రిజర్వాయర్ పర్యటన కూడా చేసింది. నిర్వాసితులకు న్యాయం చేసే విధంగా చర్యలు చేపడుతామని, రిజర్వాయర్ నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్తామని అప్పట్లో కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల బృందం ప్రకటించింది. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సైతం ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ పెంచేందుకు కృషి చేస్తానని, అవసరం అనుకుంటే నిర్వాసితుల పక్షాన నిలబడి ప్రభుత్వంపై పోరాడతానని ప్రకటించారు.

పెండింగ్ పనులపై దృష్టి

ఉదండాపూర్ రిజర్వాయర్ కట్ట నిర్మాణ పనులకు సంబంధించి ఇప్పటి వరకు దాదాపు 60 శాతం పనులు పూర్తయ్యాయని మిగతా పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామని డీఈఈ సురేశ్ ఈ సందర్భంగా తెలిపారు. అదేవిధంగా రెండు సొరంగాలకు సంబంధించి దాదాపు 70 శాతం పనులు పూర్తయ్యాయని సంబంధిత డీఈఈ మురళీధర్‌గౌడ్ తెలిపారు. తవ్వకం పనులు పూర్తి కాగా కాంక్రీట్ నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పంపుహౌజ్, సర్జికల్‌పూల్, కాంక్రీట్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఆయా పనులను పూర్తి చేసేవిధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

పనులకు శ్రీకారం

ఈనేపథ్యంలో ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గత వారం పది రోజులుగా రిజర్వాయర్ క్యాంపులు వాహనాలతో కళకళలాడుతున్నాయి. హిటాచీ, జేసీబీ, తదితర యంత్రాలతో పాటు టిప్పర్లు పెద్ద ఎత్తున తరలి వచ్చాయి. అయితే నిర్వాసితులు తమకు పరిహారం ఇచ్చి పునరావాసం కల్పించిన తర్వాతే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు. పనులను అడ్డుకునే ప్రయత్నం చేసే పరిస్థితి ఉండడంతో పోలీసులు క్యాంపుల వద్ద పహారా కాస్తున్నారు. ప్రతి రోజు పోలీసు బలగాలు వల్లూరు సమీపంలోని క్యాంపుల వద్దకు వెళ్లి బందోబస్తు నిర్వహిస్తున్నాయి. అయితే స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తమకు స్పష్టమైన హామీ ఇచ్చి న్యాయం చేసేవిధంగా కృషి చేయాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు.

అక్రమ రవాణాను అడ్డుకోవడమే లక్ష్యం


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ శ్రీనివాస్‌రావు


బొలెరో వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

- జోగుళాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాస్‌రావు
- హైవేపై మెగా వాహన తనిఖీలు


బస్సులో బ్యాగు పరిశీలిస్తున్న పోలీసు

అలంపూర్/ ఉండవెల్లి: అంతర్రాష్ట్ర రహదారిలో నిషేధిత, అక్రమ రవాణాను అడ్డుకోవమే లక్ష్యం అని జోగుళాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. ఉండవెల్లి మండలంలోని పుల్లూరు టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారి–44పై శనివారం మెగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ పర్యవేక్షణలో సాయుధ బలగాలు, రవాణా శాఖ అధికారులు, 200 మంది సిబ్బందితో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులోని జాతీయ రహదారిపై సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు ఏకధాటిగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బస్సులు, కార్లు, గూడ్స్ లారీలు, ఆటో, బైక్‌లను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు, ట్రాఫిక్ ఉల్లంఘించిన వారికి జరిమానాలు, అనుమానాస్పద వ్యక్తులకు ఫింగర్ ప్రింట్ తనిఖీలు నిర్వహించారు. పరిమితికి మించి ప్యాసింజర్లను తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి జరిమానాలు విధించారు. గూడ్స్ వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి అందుకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. బస్సుల్లోనూ ప్యాసింజర్ బ్యాగ్‌లను తనిఖీ చేసి వివరాలు సేకరించారు. మొత్తంగా 76 బస్సులు, 256 గూడ్స్ వాహనాలు, 168 లారీలు, 171 కార్లు, 134 ఆటోలు, 365 బైక్‌లను తనిఖీ చేశారు. ఇందులో సరైన పత్రాలు లేని 124 ఆటోలు, 102 ద్విచక్రవాహనాలు, 5 బొలెరోలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు 16 డీడీ కేసులు, 35 ఓవర్ స్పీడ్ గన్ చలాన్స్, 16 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ముగ్గురు సీఐలు, 18 మంది ఎస్ఐలు, 180 మంది పోలీస్ సిబ్బందితో తనిఖీలు కొనసాగాయన్నారు. గూడ్స్ వాహనాల్లో ప్యాసింజర్లను తరలించకుండా, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులు ఉండకుండా అవగాహన కల్పించామన్నారు. రవాణా చట్టాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐలు రవిబాబు, నాగేశ్వర్‌రెడ్డి, టాటబాబు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజు, ఎస్ఐ వెంకటస్వామి పాల్గొన్నారు.

ట్రావెల్ బస్సు బోల్తా


అడ్డాకుల వద్ద జాతీయ రహదారిపై బోల్తాపడిన ట్రావెల్స్ బస్సు

నడచుకుంటూ వెళుతున్న వ్యక్తిపై పడటంతో దుర్మరణం

- మరో ముగ్గురికి గాయాలు
- అడ్డాకుల మండలం ఎన్‌హెచ్–44పై ఘటన


మృతుడు క్యాసని కృష్ణయ్య(ఫైల్)

అడ్డాకుల: 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిపై ఓ ప్రైవేట్ బస్సు బోల్తా పడడంతో అతను అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్ఐ ఎం.శ్రీనివాస్ కథనం ప్రకారం.. బీఎంసీసీ వోల్వో ట్రావెల్స్ బస్సు శుక్రవారం రాత్రి 27 మంది ప్రయాణికులతో బెంగళూర్ నుంచి హైదరాబాద్‌కు బయల్దేరింది. అడ్డాకుల వద్ద శనివారం తెల్లవారుజామున లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో బస్సు అదుపు తప్పింది. అదే సమయంలో అడ్డాకులకు చెందిన క్యాసని కృష్ణయ్య(49) బహిర్భూమి కోసం రహదారి పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా అదుపు తప్పిన బస్సు అతనిపై బోల్తాపడింది. దీంతో బస్సు కింద కృష్ణయ్య శరీరం నుజ్జునుజ్జయింది. మృతదేహం గుర్తు పట్టడానికి వీలు లేకుండా మారింది. ఇదిలా ఉండగా బోల్తాపడిన బస్సులో ప్రయాణికుల్లో ధనుంజయరెడ్డి, శ్రీధర్, డ్రైవర్ వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి. స్థానికులు బస్సులో ఉన్న వారిని బయటకు తీసి గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. తర్వాత కృష్ణయ్యపై పడిపోయిన బస్సును అతి కష్టం మీద రహదారి నిర్వాహకులు పైకి తీశారు. కృష్ణయ్య మృతదేహం ముద్దగా మారిపోయింది. ఘటనా స్థలంలో మృతుడి బంధువుల రోదనలు కలిచి వేశాయి. మృతుడికి భార్య చిట్టెమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య చిట్టెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

23నుంచి మన్యంకొండలో వీరభద్రస్వామి ఉత్సవాలు


వీరభద్రస్వామి మూలవిరాట్

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం క్షేత్రపాలకుడు శ్రీ వీరభద్రస్వామి ఉత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నారు. మన్యంకొండ దేవస్థానం ఆవరణలో ఉన్న వీరభద్రస్వామి ఉత్సవాన్ని ప్రతి ఏడాది ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే రెండు రోజుల పాటు జరిగే స్వామి వారి ఉత్సవానికి ఈ ఏడాది కూడా అన్ని ఏర్పాట్లు చేశారు. వేంకటేశ్వర స్వామికి వీరభద్రస్వామి క్షేత్రపాలకుడు. దీంతో వేంకటేశ్వరస్వామి దేవస్థానం సమీపంలోనే వీరభద్రస్వామి దేవస్థానం కొలువుదీరింది. అందుకే ప్రతి ఏడాది వీరభద్రస్వామి ఉత్సవాన్ని అనాదిగా సంప్రదాయరీతిలో నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ సందర్భంగా ఉత్సవాల మొదటిరోజు స్వామివారి సన్నిధిలో ప్రత్యేక అలంకరణతో పాటు అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలతో ఉత్సవానికి శ్రీకారం చుడుతారు. ఈ నెల 24న తెల్లవారుజామున అగ్నిగుండం నిర్వహిస్తారు. దేవస్థానం ఆవరణలో నిర్వహించే అగ్నిగుండం కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని, ఆ రోజు పలు పూజలు నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు.

ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ

- గ్యాస్ కట్టర్‌తో మిషన్ ధ్వంసం చేసి.. రూ.17.92 లక్షలు ఎత్తుకెళ్లిన దుండగులు
- వనపర్తి జిల్లా పెబ్బేరులో ఘటన



వనపర్తి రూరల్: వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి కథనం ప్రకారం.. పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఎంఆర్ఎఫ్ షోరూం పక్కన గల ఎస్‌బీఐ ఏటీఎంను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆక్సిజన్, గ్యాస్ సిలిండర్లు, కట్టర్ పరికరాలు ఉపయోగించి ఏటీఎం మిషన్‌ను కట్‌చేసి అందులో ఉన్న నగదు రూ.17.92 లక్షలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై ఏటీఎం సీనియర్ ఎగ్జిక్యూటీవ్ నర్సింహగౌడ్ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఘటనా స్థలాన్ని ఏఎస్పీ రాందాస్ తేజావత్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ రాంబాబు, క్లూసు టీం పరిశీలించారు.

తెలంగాణ ఉద్యమ ఊపిరి లక్ష్మణ్ బాపూజీ

బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌సాగర్


కొండా లక్ష్మణ బాపూజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ తొలి దశ, మలితరం ఉద్యమంలో కీలకపాత్ర పోషించి ఉద్యమాల ఊపిరిగా కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు గడించారని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌సాగర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని బీసీ సమాజ్ కార్యాలయంలో శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ పీపుల్స్ పార్టీ స్థాపించి ప్రత్యేక రాష్ట్ర సాధనే లక్ష్యంగా ముందుకెళ్లారన్నారు. 96 ఏళ్ల వయసులో కూడా తెలంగాణ కోసం ఢిల్లీలో దీక్ష చేసిన గొప్ప కార్యదీక్షపరుడని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని, తెలంగాణ కోసం 1969లోనే తన మంత్రి పదవిని సైతం త్యాగం చేసిన గొప్ప త్యాగశీలి అని అన్నారు. కార్యక్రమంలో కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షులు బుగ్గన్న, రజక సంఘం జిల్లా అధ్యక్షులు పురుషోత్తం, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సారంగి లక్ష్మికాంత్, మద్దూరి కృష్ణ, దుర్గేష్, సుకుమార్, రామానంద్, జగదీష్ చందర్, సవారి సత్యం, బి.శేఖర్, మున్నూరు కేశవులు, ఆంజనేయులు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం: ఒకరు మృతి

ముగ్గురికి గాయాలు


బోల్తాపడిన డీసీఎం

వనపర్తి రూరల్: బైక్, డీసీఎం ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి గాయాలైన సంఘటన శనివారం రంగాపూర్ –పెబ్బేరు మధ్యలో ఎన్‌ఎచ్–44పై చోటు చేసుకుంది. పెబ్బేరు ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి వివరాల ప్రకారం.. జోగులాంబ గద్వాల్ జిల్లా, మానవపాడు మండలం, బోరవెల్లి గ్రామానికి చెందిన బేరి రాజేష్(23) అతని స్నేహితుడు మధుతో కలిసి బైక్‌పై పెబ్బేరు వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో కర్నూల్ నుంచి తమాట లోడ్‌తో హైదరాబాద్ వెళ్తున్న డీసీఎం అతివేగంగా ముందు వెళ్తున్న కంటైనర్‌ను ఢీకొట్టింది. అదపుతప్పి పక్కన వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో బైక్‌పై వెళ్తున్న బేరి రాజేష్(23)అక్కడికక్కడే మృతి చెందాడు. మధుకు గాయాలయ్యాయి. డీసీఎం డ్రైవర్ అనిల్, క్లీనర్ లక్ష్మణ్‌కు తీవ్రగాయాలు కాగా, ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని క్షతగాత్రులను వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రుక్కన్నపల్లిలో చిరుత సంచారం


ఖిల్లాఘనపురం మండలం రుక్కన్నపల్లి చించోని గుట్టపై కనిపిస్తున్న చిరుత

ఖిల్లాఘనపురం: మండలంలోని రుక్కన్నపల్లి శివారులో శనివారం సాయంత్రం చిరుత పులి సంచరించినట్లు గ్రామస్తులు తెలిపారు. సాయంత్రం సమయంలో గ్రామ శివారులోని దుంకుడు వాగు దగ్గర చించోని గుట్టపై చిరుత కనిపించిందని గ్రామ ప్రజలు తెలిపారు. పులి వచ్చినట్లు సమాచారం తెలియడంతో రైతులు, మేకలు, గొర్రెల కాపరులు తమ మేకలు, పశువులు, గొర్రెలను గ్రామానికి తోలుకొచ్చారు. గ్రామంలో ప్రజలు భయంతో వ్యవసాయ పొలాలకు వెల్లడంలేదు. గుట్టపై కనిపించిన చిరుత కోతులకుంట తండా పక్కకు వెళ్లినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

కొనసాగిన వైద్య విజ్ఞాన సదస్సు


ప్రదర్శనలు తిలకిస్తున్న విద్యార్థులు

పాలమూరు: జిల్లాకేంద్రంలోని ఎస్‌వీఎస్ మెడికల్ కళాశాలలో నిర్వహించిన వైద్య విజ్ఞాన ప్రదర్శన శనివారం రెండోరోజు కొనసాగింది. అయితే రెండోరోజు ఆరు విభాగాలు జనరల్ సర్జరీ, కమ్యూనిటీ మెడిసిన్, జనరల్ మెడిసిన్, రేడియాలజీలకు సంబంధించిన స్టాళ్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 5,150 మంది విద్యార్థులు వైద్య ప్రదర్శనకు హాజరై పలు రకాల స్టాళ్లు తిలకించారు. వచ్చిన విద్యార్థులకు ప్రతి స్టాల్ దగ్గర వైద్య విద్యార్థులు అందుబాటులో ప్రాధాన్యత గురించి వివరించారు. మానవుడి శరీర అవయవాలపై ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్ అందరినీ ఆకర్షించింది. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ ఆస్పత్రి నిర్వాహకులు కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, ప్రిన్సిపాల్ జోషి తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు 17 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి శనివారం రాత్రి 9 గంటలకు 17 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో నాలుగు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం 19,318 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. ఆవిరి రూపంలో 95 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 820 క్యూసెక్కులు, కుడి కాల్వకు 700 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు, సమాంత కాల్వకు 800 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి మొత్తం 21,833 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.562 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

శ్రీశైలంలో నీటిమట్టం 877.1 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో శనివారం నీటిమట్టం 877.1 అడుగుల వద్ద 173.4698 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల నుంచి విద్యుదుత్పత్తి ద్వారా 19,318 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 15,009 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 13,500 మొత్తం 25,5009 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

15 మంది పేకాట రాయుళ్లు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఏజాజుద్దీన్

మహబూబ్‌నగర్ క్రైం: పేకాట ఆడుతున్న ఓ ఇంటిపై టూటౌన్ పోలీసులు దాడులు చేసి 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ ఏజాజుద్దీన్ వెల్లడించారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాకేంద్రంలోని మోటార్ లైన్ సమీపంలో ఏవీడీ థియేటర్ దగ్గర ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీ స్ బృందంతో వెళ్లి దాడులు చేసినట్లు చెప్పా రు. అక్కడ పేకాట ఆడుతున్న 15 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.37 వేల నగదు, 15 సెల్‌ఫోన్స్, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలతో పాటు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినట్లు తెలిస్తే డయల్ 100 లేదా 87126 59312 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎస్ఐలు విజయ్ భాస్కర్, ఓబుల్‌రెడ్డి, సిబ్బంది శేఖర్, రఘుపతిరెడ్డి, మురళి, వెంకటరాములు, బాబ్య పాల్గొన్నారు.

